




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 24 ఏప్రిల్ 2025 పేజీలు 8


## ప్రభుత్వ పాఠశాలల్లో 80శాతం ఉత్తీర్ణత

8


జి.శశికళ (574)


కూనపరెడ్డి సాయికీర్తి (574)

### విజయపరంపరతో ముందుకు సాగిపోతున్న శ్రీ చైతన్య



వివరాలు 8 లో

### బిగ్ బాస్ బండారం మొత్తం

# బయటపెడతాం





- ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు
- ఒక్కో ఇటుక పేర్చుకుంటూ రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం నిర్మిస్తోంది
- అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వ లేక వైసీపీ కుట్రలు
- మద్యం స్కాంలో బాగోతాలన్నీ బయటకొస్తున్నాయి
- పేదల బియ్యాన్ని బొక్కిన పేర్ని నాని నేడు బీరాలు పోతున్నాడు
- మచిలీపట్నంలో కనీ వినీ ఎరుగని అభివృద్ధి చేసి చూపిస్తా
- ప్రజాస్వామ్యంలో అరాచక శక్తులకు స్థానం లేదని మంత్రి కొల్లు రవీంద్ర మాస్ వార్నింగ్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్య దేశంలో ప్రజల హక్కుల్ని హరించి, అడ్డగోలుగా తప్పులు చేసిన వారు ఏదో ఒక రోజు చట్టం ముందు దోషిగా నిలబడడం తథ్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నేతల ఐదేళ్ల అరాచకాలన్నీ ఒక్కొక్కటి బయటపడుతుండడంతో.. కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు కుట్రలు చేస్తున్నారు. ఈస్కాములో ఉన్న అసలు బిగ్ బాస్ గుట్టు కూడా త్వరలోనే బయట పెడతాం. మద్యం స్కాం వెనుక చాలా మంది హస్తం ఉందని కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుండి చెబుతూనే ఉన్నాం... ఇప్పటికే స్కాం వివరాలను

మిగతా 2లో

# శిక్షణ, ఉపాధి కల్పనే ధ్యేయంగా సీడాప్

- చర్మకారులకు అత్యాధునిక సాంకేతికలో శిక్షణతోపాటు ఉపాధి కల్పన
- ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్న సీడాప్, లిడ్ క్యాప్ సంస్థలు
- సీడాప్ చైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు




**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** చర్మకారులకు అత్యాధునికి సాంకేతిక పరిజ్ఞానంలో ఉచితంగా శిక్షణ అందించి ఉద్యోగాల కల్పన కోసం సీడాప్, లిడ్ క్యాప్ ల మధ్య ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన, వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి, తెలిపారు.. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో గల సీడాప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ దీపక్ రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన యువతను పరిశ్రమలకు అందించేలా సీడాప్ అనేక సంస్థలతో అవగాహనా ఒప్పందం చేసుకుందన్నారు. టెలికామ్, హెల్త్, ఎలక్ట్రానిక్స్ లాంటి ప్రముఖ సెక్టార్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, 2,700 జాబ్ రోల్స్ ఉన్నాయన్నారు. 20,000 మందికి సీడాప్ సమాచారాన్ని అందించిందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు. ఎస్సీ నిరుద్యోగ యువతకు, మహిళలకు నైపుణ్యాభివృద్ధిలో ఉచితంగా శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. అందులో భాగంగానే లిడ్ క్యాప్ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధిలో ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణలో వారికి ఉచితంగా భోజన, వసతి తదితరమైనవి కల్పిస్తామని, అనంతరం వారికి అవసరమైన ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తామన్నారు. 46 ఏజెన్సీలతో ఒప్పందం చేసుకున్నామని, 92 సెంటర్స్‌లో శిక్షణ అందిస్తామన్నారు. దీనికి సంబంధించిన వివరాలు సీడాప్ వెబ్ సైట్‌లో పెట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను సీడాప్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మానటరింగ్ చేస్తామన్నారు. అంతర్జాతీయంగా వాడే లెదర్ కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎగుమతి అవుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్‌ల ఆకాంక్షల మేరకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తయారు కానుందన్నారు. లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మానిక్యరావు మాట్లాడుతూ చర్మకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. తోలు సంబంధిత పరిశ్రమ విభాగంలో ఎస్సీ నిరుద్యోగ యువ తకు ఉచిత శిక్షణ అందించి వారి జీవనోపాధి మెరుగు పరచేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్‌ల ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లుతున్నామన్నారు. ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కోసం 'సీడాప్' తో ఒప్పందం చేసుకు న్నామని, ఇందుకు కోటి రూపాయల నిధులను సీడాప్‌కు కేటాయించా మన్నరు. చెప్పులు, బెల్టులు, షూలు అధునాతన, యంత్రాలతో తయారు చేసేలా యువ తకు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. చర్మకారులకు ఉపాధి పెరిగేలా జీవో నెంబర్ 70ని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ జీవో ద్వారా లెదర్ వస్తువులు ఉపయోగించే పోలీస్ శాఖలో వాడే బెల్టులు, షూలు, ఆర్టీసీ కండక్టర్లు వారే లెదర్ బ్యాగులు, వంటి వాటిని వాడే అన్ని ప్రభుత్వ శాఖలు వారికి అవసరమైన అన్ని లెదర్ వస్తువులను లిడ్ క్యాప్ వద్దనే కొనుగోలు చేయాలన్నారు. జీవో ఇచ్చినందుకు

మిగతా 2లో

# సమాజానికి మేధావులను అందించింది ప్రభుత్వ పాఠశాలలే...





## స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం ఎస్. సుబ్రహ్మణ్యం

## స్కూల్ అభివృద్ధికి లంకిశెట్టి బాలాజీ లక్ష విరాళం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ నుంచి అనేకమంది మేధావులు చదువుకున్నది, ఎదిగింది ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల దీవెనలతో అని మచిలీపట్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్. సుబ్రహ్మణ్యం అన్నారు బుధవారం గూడూరు మండలం ఆకుమర్రు గ్రామంలో ప్రభుత్వ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం సి ఎస్ ఆర్ ఫండ్స్ కింద కేటాయించిన ఐదు లక్షల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలను ఎస్. సుబ్రమణ్యం ప్రారంభించారు. భారతదేశంలోని అతిపెద్ద బ్యాంకింగ్ వ్యవస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని కొన్ని లక్షల మందికి చేదోడు వాదోడుగా ఉంటూ బ్యాంకు దేశవ్యాప్తంగా సిఎస్ఆర్ ఫండ్ ద్వారా కోట్లాది రూపాయలతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఆయన తెలియజేశారు. గూడూరు మండలంలో మల్లవోలు, గూడూరు గ్రామాల్లో తమ శాఖ ద్వారా రైతులకు పలు పథకాల కింద రుణాలు అందిస్తున్నట్టు తెలియజేశారు. ఎక్కువ మంది ఆడపిల్లలు చదువుతున్న పాఠశాల ఆకుమర్రు పాఠశాల తమ బ్యాంకు సేవలు ఆ స్కూల్లో అందించడం జరిగిందని ఆయన తెలియజేశారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పిల్లలను చదువుతోపాటు నైతిక విలువలు కూడా పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మరో గౌరవ అతిథి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఏరోజుకారోజు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన చదువును కంఠస్థం చేయాలని చదువుతోపాటు సమాజం పట్ల కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు.. ఎస్బిఐ సిఎస్ఆర్ ఫండ్స్ ఇవ్వడం వలన అప్పర్ ప్రైమరీ స్కూలు హై స్కూల్గా అప్ గ్రేడ్ అయినందున స్కూల్లో నిర్మించవలసిన తరగతి గదిలో నిర్మాణం కోసం న్యాయవాది లంకిశెట్టి బాలాజీ లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు.. ఆకుమరు గ్రామం నుండి ఎస్బిఐ కి ఇద్దరు ఏజీఎంలుగా హనుమంతరావు సత్యనారాయణ లను అందించిన ఘనత ఉందని అన్నారు. తల్లిదండ్రులు ప్రతి రోజు తమ పిల్లల పట్ల వారి కదలికల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు మారుతున్న టెక్నాలజీతో చిన్న వయసులోనే పిల్లలకి తప్పుడు సంకేతకాలు ఉంటున్నాయని అది సమాజానికి మంచిది కాదని బాలాజీ అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన గ్రామ మాజీ సర్పంచ్ గోపి నాగబాబు మాట్లాడుతూ పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సహాయ సహకారాలతో తమ గ్రామ పాఠశాల హైస్కూల్ గా అప్ గ్రేడ్ వలన తమ గ్రామంలో ఆడపిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా తరగతి గదుల నిర్మాణం కోసం న్యాయవాది లంకిశెట్టి బాలాజీ లక్ష రూపాయలు విరాళం ప్రకటించడం తమ గ్రామ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాము జైపాల్ ముఖర్జీ న్యాయవాది భరద్వాజ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ పావని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.. తొలుత ఎస్.బి.ఐ స్కూల్ కి అందించిన కంప్యూటర్ సిస్టమ్ ను రీజనల్ మేనేజర్ సుబ్రమణ్యం ప్రారంభించారు. ఎస్.బి.ఐ 5 లక్షల రూపాయల నిధులతో ఆకుమర్రు పాఠశాలలో టాయిలెట్స్, వాటర్ ట్యాంక్, బోర్ సిస్టం, కంప్యూటర్ సిస్టంకు కేటాయించారు.

## టీడీపీ నేతలకు పరామర్శ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్ సతీమణి మల్లేశ్వరి మృతిచెందగా ఆమె భౌతికకాయాన్ని పలువురు ప్రముకులు సందర్శించి నివాళులు అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. మోర్ల ప్రసాద్, కుమారులు మోర్ల రాంబాబు, మోర్ల శివలను పరామర్శించి సానుభూతిని తెలిపారు. రాష్ట్ర గౌడ కార్పోరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, టీడీపీ రాష్ట్రనేత కొనకళ్ల బుల్లయ్య, డాక్టర్ డిఆర్కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, నేతలు మండవ బాలవర్ధిరావు, యార్లగడ్డ లంకబాబు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, సజ్జా చలపతిరావు, తుమ్మల చౌదరిబాబు, రావి నాగేశ్వరరావు, మాలెంపాటి శ్రీనివాసరావు, నిడమానూరి దిలీప్కుమార్, ముమ్మనేని నాని, కొల్లూరు కోటేశ్వరరావు, శీరం నాని, వివిధ పార్టీల నేతలు, ప్రముకులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. బుల్లయ్య, గురుమూర్తిలతోపాటు పలువురు నేతలు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## మోర్ల ప్రసాదు సతీవియోగం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్ సతీమణి మల్లేశ్వరి(65) మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. స్థానిక ఉప్పల వారి వీధిలోని నివాసగృహంలో మల్లేశ్వరి భౌతికకాయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావులు సందర్శించి నివాళులు అర్పించారు. మల్లేశ్వరి భర్త ప్రసాద్ను, కుమారులైన మండల టీడీపీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు మోర్ల శివలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. యువనేత మండలి వెంకట్రామ్, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, ఏఎంసీ చైర్మన్లు తోట కనకదుర్గ, కొల్లూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, షేక్ నబీఘోరి, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, పార్టీనేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, యాసం చిట్టిబాబు, తలశిల స్వర్ణలత, తాడికొండ చిన్నా, సీఐ ఈశ్వరరావు, వివిధ పార్టీల నేతలు, ప్రముకులు పెద్దఎత్తున తరలివచ్చి మల్లేశ్వరి భౌతికకాయానికి నివాళులు అర్పించారు.



## నూతన విద్యా విధానంపై వ్యాసరచన పోటీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నూతన విద్యా విధానం - 2020 పై నిర్వహించిన వ్యాస రచన పోటీలో విజేత లకు కృష్ణా విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ జ్ఞాపికలు అందచేశారు. ప్రస్తుత విద్యావిధానం పై నూతన విద్యా విధానం ప్రభావం అనే అంశంపై ఎన్ ఈ పి సారథి నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఆచార్య దిలీప్, ఎన్ ఈ పి సారథి సమన్వయకర్త డాక్టర్ ఎల్ సుశీల, పరీక్షల నియంత్రణ అధికారి డా. పి వీరబ్రంహాచారి తదితరుల పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులు గోళ్ళ నాగేశ్వరావు ఇకలేరు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు వాళ్ల నాగేశ్వరరావు బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఈయన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు బావ, అవనిగడ్డ రెండవ సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు గోళ్ళ కృష్ణకుమారి భర్త కాగా,మరణ వార్త తెలుసుకున్న గ్రామ ప్రముఖులు మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు, జెడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచి గోరుముచ్చు ఉమా, ఎంపీపీ తుంగల సుమతి, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు తదితరులు నాగేశ్వరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగేశ్వరావు కు ఒక కుమారుడు కుమార్తె కాగా ఇరువురికి వివాహాలు అయ్యాయి ఈ సంఘటనతో రెండవ వార్డులో విషాదఛాయలు అమ్ముకున్నాయి.నాగేశ్వరావు అంత్యక్రియలు గురువారం ఉదయం జరుగుతాయని వారి బంధువులు తెలిపారు.

## దైవ సేవకులకు గౌరవ వేతనం ఎందుకు ?



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భారత రాజ్యాంగంలో కుల మత రహిత సమాజాన్ని నిర్మించాలనే సారాంశాన్ని ఎందుకు పెడదారిలో పెడుతున్నారని, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ దోవా గోవర్ధన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దైవ సేవకులకు ప్రతి నెలా గౌరవ వేతనం ఎందుకు ఇస్తున్నారని, అదే వేతనం రైతులకు ఎందుకు ఇవ్వడంలేదని గోవర్ధన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. అప్పులతో పూట గడవక ఏ దైవ సేవకుడు, పూజారైనా ఆత్మహత్య చేసుకున్నాడా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు వివిధ మత గురువులకు ఇచ్చే విలువ రైతులకు భవన నిర్మాణ కార్మికులకు, సమాజ సేవ చేసే వారికి ఎందుకు ఇవ్వడం లేదన్నారు. మతం పేరుతో జరిగే కొన్ని కార్యక్రమాల కారణంగా ప్రజలు గ్రూపులుగా విడిపోతున్నారని అందువల్ల దేశ అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. కుల నిర్మూలన కోసం ప్రభుత్వాలు పాటుపడాలని కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని రాజ్యాంగం చెబుతుంటే అది ఎందుకు పట్టించుకోరని అన్నారు. కులాంతర సామాజిక వివాహాల ప్రోత్సాహం ఎందుకు ఇవ్వడంలేదని నిలదీశారు. దేశ అభివృద్ధికి రైతులు ఏరోజు అవరోధం కాదని గుర్తించాలన్నారు.రోజు వారీ కూలీ కార్మికుల జీవితాలకు ఇలాంటి భరోసానే కల్పించాలని కోరారు.

## అపరాల (మినుము, పెసర) కొనుగోలు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** రబీ 2024-25 సీజన్లో గుడ్లవల్లేరు మండలంలో డిసిఎమ్ఎస్ ద్వారా మినుము, పెసర కొనుగోలు కేంద్రాలు గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్లో ప్రారంబించడం జరిగింది. ప్రభుత్వం మద్దతు ధర మినుము పంటకు క్వింటాల్ కు రూ 7400/, పెసరకు క్వింటాల్ రూ 8682/- నిర్ణయించడమైనదని మండల వ్యవసాయ అధికారి ఎల్ సునీల్ తెలియజేశారు. కావున మండలములోని రైతులందరూ ప్రభుత్వం నిర్ధేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న అపరాల పంటను రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద సీఎం యాప్లో పేర్లు నమోదు చేసుకుని మద్దతు ధర పొందవల్సినదిగా ఏఓ సునీల్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిసిఎమ్ఎస్ ఫీల్డ్ సూపర్వైజర్ అమల్ కుమార్, నవీన్, టెక్నికల్ అసిస్టెంట్ స్పందన, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసన్న కుమార్, గోపి కృష్ణ పాల్గొన్నారు.

## వేళాపాళలేని విద్యుత్ కోతలతో ఉక్కిరిబిక్కిరి

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** నిరంతర విద్యుత్ సరఫరా అని విద్యుత్ అధికారులు చెబుతున్నా, మండల కేంద్రమైన గుడ్లవల్లేరుతోపాటు గ్రామాల్లో ప్రతిరోజు మధ్య మధ్యలో చాలాసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. వేళాపాళలేని అనధికార కరెంటు కోతలతో గుడ్లవల్లేరు మండలం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వేసవి కాల ఉష్ణోగ్రతలు 45 నుంచి 50 డిగ్రీలు నమోదవుతున్నవేళ విద్యుత్ అంతరాయం మరింత యిబ్బందులకు గురిచేస్తోంది. అనధికార, మెయింటెనెన్స్ కోతలతో చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి పీడితులు అల్లాడిపోతున్నారు. ఒకవైపు వేసవితాపం, ఉక్కపోత ఇంటా బయటా ఎక్కడా మసలలేని పరిస్థితి. గుడ్లవల్లేరు బిసి బాయ్స్ హాస్టల్ ప్రాంతంలోలోవోల్టేజి సమస్యతో ఫ్యాన్లు సైతం తిరగని దుస్థితి. యిప్పటికైనా సంబంధిత ట్రాన్స్ కో అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని, యిబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

## పి హెచ్ సి నూతన భవన నిర్మాణ స్థల పరిశీలన చేసిన వేదవ్యాస్



**గూడూరు మేజర్ న్యూస్ :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం కంకటావ గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించేందుకు బుధవారం స్థల పరిశీలన చేసిన మాజీ శాసనసభ్యులు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ గ్రామ ప్రముఖులు. గ్రామాభివృద్ధి కోసం గ్రామస్తులంతా ఐకమత్యంగా నిర్ణయం తీసుకోవాలని వ్యాస్ సూచించారు. గత కొద్ది రోజులుగా స్థలం కోసం పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు.ఈ విషయాన్ని వ్యాస్ దృష్టిలో ఉంచారు.ఇందులో భాగంగా స్థల పరిశీలన జరిపిన ఆయన జిల్లా వైద్యాధికారిని డా శర్మిష్ఠ స్థానిక తాసిల్దార్ తోటి ఫోన్లో మాట్లాడారు. వారి అభిప్రాయాన్ని కూడా తీసుకున్నారు.విషయాన్ని శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తో మాట్లాడి నిర్ణయం చేస్తానని వ్యాస్ గ్రామ పెద్దలకు తెలిపారు.ఈ గ్రామానికి త్వరలోనే పి హెచ్ సి భవన నిర్మాణం సాకారం కానుండటంతో గ్రామస్తులు హర్షం ప్రకటించారు.



## జిల్లా పోటీల్లో ఫైనల్ చేరిన గుడ్లవల్లేరు పంచాయతీరాజ్ టీమ్

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా పంచాయతీ రాజ్ ఉద్యోగుల క్రికెట్ పోటీలు విజయవాడలో జరుగుతున్నాయి. జిల్లా స్థాయి పోటీలలో గుడ్లవల్లేరు మండల పంచాయతీరాజ్ ఉద్యోగుల టీమ్ ఫైనల్‌కు చేరడం జరిగింది. మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందితో కూడిన క్రికెట్ టీమ్ జిల్లా స్థాయిలో ఫైనల్ కు చేరడం పట్ల పంచాయతీ, మండలపరిషత్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసారు. గుడ్లవల్లేరు మండల టీమ్ ను ఎంపిడిఓ టి. విజయ సారధి, ఏఓ ఇమ్రాన్, గుడ్లవల్లేరు కార్యదర్శి ఎజెఎల్ నరసింహా రావు, దోకిపర్రు కార్యదర్శి మస్తాన్ రావు, గుడ్లవల్లేరు విఆర్ఓ ఎస్. ప్రకాష్ లు అభినందనలు తెలిపారు.

## దేవినేని ఉమా కుమారుడిని పెండ్లి పిలుపు



**నందిగామ, ఏప్రిల్ 23, మేజర్ న్యూస్:** మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు వారి కుమారుని వివాహ ఆహ్వాన పత్రికను బుధవారం నందిగామ పట్టణం కాకాని నగర్‌లో ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకి వారి కార్యాలయానికి విచ్చేసి కూటమి నేతలతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలను అభినందనలు, పతకాల బహూకరణ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్లో ఇంటర్ బైపీసీ గ్రూపులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన కేతరాజు గుణశ్రీ, పిట్టు పూజితలక్ష్మి, బొల్లా నవ్యలను ఎమ్మీవో పి.వెంకటేశ్వరరావు, అధ్యాపక బృందం అభినందించి పతకాలను బహూకరించారు. విద్యార్థినిలకు అధ్యాపకులు ప్రోత్సాహకాలు అందచేశారు. బుధవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవ వేడకల్లో తెలుగు అధ్యాపకురాలు ఓలేటి ఉమాసరస్వతి సొంత ఖర్చుతో విద్యార్థినిలకు పతకాలను ఎమ్మీవో ద్వారా అందచేశారు. బోటనీ, జువాలజీలో పూర్తిమార్కులు రావటం, ఆయా సబ్జెక్టుల్లో అందరూ ఉత్తీర్ణులు కావటంతో అధ్యాపకులు రాజమహేశ్వరి, నాగలక్ష్మి, అల్లూరి సుజాత, సిహెచ్. లక్ష్మిలను సత్కరించారు. బోటనీ, ఫిజిక్స్ అధ్యాపకులు వై.రాజమహేశ్వరి, సిహెచ్. లక్ష్మిలు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలకు వెయ్యి రూపాయల చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక నగదు అందించారు. హెచ్‌ఎం కెబిఎన్.శర్మ, అధ్యాపకులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

## ఫెడరేషన్ కప్-ఏరోబిక్స్ నేషనల్ ఛాంపియన్షిప్‌కు వి.పి.ఎస్. పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న వి.పి.ఎస్. పబ్లిక్ స్కూల్ కి చెందిన విద్యార్థులు కె.శ్రీ సరయు-8బి, ఎం.హిమేష్-7ఎ, వి.మౌనిక-6డి, 2025 ఏప్రిల్ 25 నుండి 27 వరకు సౌత్ గోవాలో మడ్గావ్‌లోని జరగబోయే ఫెడరేషన్ కప్-ఏరోబిక్స్ నేషనల్ ఛాంపియన్షిప్‌లో పాల్గొనబోతున్నారు. తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి విజయంతో తిరిగి రావాలని ప్రిన్సిపాల్ మేదా సీతారామయ్య ఆశీర్వదించారు.

# అంగరంగవైభవంగా బడేమియా హజరత్ ఉరుసు ఉత్సవాలు





**కంచికచర్ల, మార్చి 23, మేజర్ న్యూస్:** పెండ్యాల గ్రామములో బుధవారం నాడు గ్రామ సర్పంచ్, మైనారిటీ నేతలు, కూటమి నేతలతో కలిసి బడేమియా హజరత్ ఉరుసు ఉత్సవాలలో భక్తులకు, స్థానికులకు మజ్జిగ, రహదారి వెంబడి తినుబండారాల కిట్లను ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పంపిణి చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో భక్తి శ్రద్ధలతో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు బడేమియా హజరత్ ను కొలుస్తారని అదేవిధంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో వేలాదిగా ప్రభాలు పెట్టుకొని స్థానికంగా మునేటి మార్గాన పెండ్యాల గ్రామము నుంచి తుర్లపాడు గ్రామమునకు తరలి వెళ్లి అక్కడ రాత్రి బస చేసి బందు మిత్రులతో వంటకాలు చేసుకొని అక్కడే అందరూ భోజనం చేస్తారని ఆ బడేమియా హజరత్ ఆశీసులతో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని సుఖసంతోషాలతో అందరూ బాగుండాలని ఆ బాబా వారిని వేడుకొన్నట్లు తంగిరాల సౌమ్య తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**పామర్రు ఏప్రిల్ 23 మేజర్ న్యూస్:** పేదలను ఆరోగ్యపరంగా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పామర్రు తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది నెలల కాలంలో ఇప్పటికే ఎంతో మందికి వైద్య సహాయం నిమిత్తం ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలను ఆరోగ్యపరంగా ఆదుకునేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడు సంసిద్ధంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 18 మంది లబ్ధిదారులకు 19,34,547 రూపాయల విలువగల చెక్కులను అందించారు. తోటవల్లూరు, పామర్రు, పెదపారుపూడి, పమిడిముక్కల మండలాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించడం తోపాటు మరో ఐదుగురికి ఎల్ఓసి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ తోపాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బుద్ధ విగ్రహాలకు స్వాగతం పలికిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం, మేజర్ న్యూస్ : థాయిలాండ్ నుండి వచ్చిన బుద్ధ విగ్రహాలకు మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో బుధవారం స్వాగతం పలికారు. బుద్ధ ప్రాజెక్టులో భాగంగా ఘంటశాలలో ఏర్పాటు చేసేందుకు థాయిలాండ్ నుండి వచ్చిన బుద్ధ భగవానుని విగ్రహాలకు మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించే బౌద్ధుని ఆశయాలకు అనుగుణంగా ప్రజలంతా నడుచుకోవాలని ఆకాంక్షించారు. సమస్త జీవరాశిపైనా బుద్ధుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బుద్ధ భగవానుడి విగ్రహం ఎక్కడ ఉంటే అక్కడ ప్రశాంత వాతావరణం కనిపిస్తుందన్నారు. మయన్మార్ పర్యటనలో బుద్ధ భగవానుని దేవాలయాలను సందర్శించడం జరిగిందన్నారు. అప్పుడు నాకు మనసుకు చాలా శాంతి లభించినట్లుగా భావించానని తెలిపారు. గౌతమ బుద్ధుడు మనదేశంలో జన్మించటం మన అదృష్టమని, ప్రపంచంలోనే చాలా దేశాల్లో.. ఉదాహరణకు జపాన్, తైవాన్, థాయిలాండ్ తదితర దేశాల్లో బుద్ధ భగవానుడిని ఆరాధిస్తారన్నారు. బౌద్ధులు చాలా కఠిన నియమాలు పాటిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులు నెలాఖరులోగా ఈ కేవైసీ చేయించుకోండి



**పమిడిముక్కల ఏప్రిల్ 23 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రేషన్ కార్డుదారులు అందరూ తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని తహసిల్దార్ కె. నవీన్ కుమార్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందాలంటే రేషన్ కార్డులో ఉన్న ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేయించుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఈనెల 30వ తేదీలోపు ఈ కేవైసీను పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. కావున ఇప్పటివరకు ఈ కేవైసీ చేయించుకొని లబ్ధిదారులు వెంటనే ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఎండియూ ఆపరేటర్లు, రేషన్ షాపు డీలర్లు, పౌరసరఫరాల ఉప తహసిల్దార్లు, తాసిల్దార్ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటాయని రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేసుకుని ఉండాలని అన్నారు. ఐదేళ్ల కంటే వయసు తక్కువ ఉన్నవారికి ఇందుకు మినహాయింపు ఉందన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి, డిజిటల్ అసిస్టెంట్ లాగిన్ ద్వారా కూడా ఈ కేవైసీ నమోదు చేసుకోవచ్చని, కావున తప్పనిసరిగా చేయించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వాసుపత్రిలో మజ్జిగ పంపిణీ చేసిన డా.ఆశాలత



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఆసుపత్రి సుపరిటెండెంట్ డాక్టర్ ఆశాలత, అనస్తియా డాక్టర్ శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో మజ్జిగ తాగటం వల్ల శరీరంలోని వేడిని తగ్గించి శక్తిని ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. అంతేగాక వడగాలు తగలకుండా సహకరిస్తుందన్నారు. ఈ వేసవిలో ప్రజలు ముఖానికి కర్చీఫ్ కట్టుకోవాలని అలాగే తలకు టోపీలు ధరించి వెళ్లాలని అప్పుడే ఎండ నుండి రక్షణ కలుగుతుందని సూచించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు పెద్దవారు ఉదయం 10లోపు పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. ప్రజలు సాధ్యమైనంత వరకు కొబ్బరినీళ్లు బార్లీ వాటరు మజ్జిగ లాంటి సేవిస్తే ఎండ నుండి ఉపశమనం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ మజ్జిగ కార్యక్రమం దాతలు వడ్డే చలపతిరావు కుమారులు వడ్డే రమేష్ ఆసుపత్రిలోని రోగులకు వారి అటెండర్ లకు ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా విజయ గ్రాండ్ ప్రారంభోత్సవం



**నందిగామ, ఏప్రిల్ 23, మేజర్ న్యూస్:** పట్టణ శివారు బైపాస్ అంబారుపేట క్రాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ గ్రాండ్ ఐస్ క్రీమ్స్, రెసిడెన్స్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఏసుబాబు, వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విజేతలను ప్రోత్సహించాలి






**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** శ్రీ శారద యూపీ స్కూల్ పాఠశాలలో విద్యార్థుల కు ప్రోత్సాహ బహుమతులు అందజేశారు. బుధవారం స్కూల్ కరస్పాండెంట్ ఎన్ఎస్ఆర్కె ప్రసాద్ ఆధ్వర్యంలో స్పెషల్ బి టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఎంసి చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు పాల్గొని విద్యార్థులు విద్య ద్వారా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. స్కూల్ లాస్ట్ వర్కింగ్ డే ని పురస్కరించుకొని క్రీడా అంశాల్లో హాజరులు సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలైన విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ అంశాలలో డిబేట్ విజేతలకు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పారిశ్రామికవేత్త పర్చూరు దుర్గాప్రసాద్ మాజీ ఎంపీపీ కనకదుర్గ బండి రాఘవ మోర్ల వెంకటేశ్వరరావు (వెంకట్) లు పాల్గొని విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ వెంకటేశ్వరరావును శాలువా,పూలమాలతో ఘనంగా సత్కరించారు.

# ఘనంగా తేజిత్ జన్మదిన వేడుకలు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మాదివాడ రాము పద్మావతి దంపతుల చిన్న కుమారుడైన తేజిత్ శ్రీ సాయి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తేజిత్ శ్రీ పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం అవనిగడ్డలోని వృద్ధులు వికలాంగులు వితంతువులు అనాథలకు 50 మందికి భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. మోపిదేవి మండల పరిధిలోని గంజివాని పాలెం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు హాట్ బాక్సులు అందజేశారు ప్రధాన ఉపాధ్యాయులు గంధం ప్రసాద్ ఎస్ఎంసి సభ్యులు విద్యార్థుల పేరెంట్స్ పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు, తేజిత్ శ్రీసాయి చదువుకుంటున్న విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో మూడవ తరగతి ఐఐటి సెక్షన్ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

హైస్కూల్లో పనిచేస్తున్న ఆయములకు చీరలు పంపిణీ చేయగా పాఠశాల కరస్పాండెంట్ పివిఎస్ ఎల్ ప్రసాద్ ఆశీస్సులు అందజేశారు ఈ కార్యక్రమంలో దివి ప్రభాకర్ విజయలక్ష్మి దంపతులు మాదివాడ వెంకటేశ్వరరావు రాంబాణం దంపతులు తోపాటు పలువురు తేజిత్ శ్రీ సాయి కి ఆశీస్సులు అందజేశారు.

# తెలుగు దేశం పార్టీ గ్రామ కమిటీలు ఏర్పాటు



**కంచికచర్ల మేజర్ న్యూస్ :** కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో తెలుగు దేశం పార్టీ గ్రామ కమిటీలు బుధవారం సర్పంచ్ మన్నే సాత్విక అధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు పార్టీ బలోపేతానికి ఎంతగానో ఉపయోగపడుతుందని సాత్విక అన్నారు.గ్రామంలో ఉన్న తెలుగు దేశం పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులూ ఉన్న ఈ కమిటీ సభ్యులకు తెలుపగలరని సాత్విక తెలిపారు.తెలుగు దేశం పార్టీ గ్రామ కమిటీలకు ఏర్పాటుకు కంచికచర్ల మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు హాజరయ్యారు.కోగంటీ బాబు కు ఇటీవలే కంచికచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా సర్పంచ్, పేరకలపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు సన్మానం చేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రైతు సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కుమార్ రాజా







**మొవ్వ ఏప్రిల్ 23 మేజర్ న్యూస్ :** రైతుల సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గూడపాడు గ్రామంలో మొవ్వ శ్రీ వేణుగోపాల వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 43 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గోదామును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా గ్రామీణ రైతు సంఘానికి ఎరువులు పురుగు మందులు విత్తనాలు రాయితీపై రాష్ట్ర ప్ర భుత్వం అందిస్తుందన్నారు. రైతుల పండించిన ధాన్యాన్ని నిల్వ బెట్టి గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ధాన్యాన్ని దాచుకునేందుకు ఇలాంటి గోడౌన్లు ఎంతో పడతాయన్నారు. తాము పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేంతవరకు గోదాముల్లో నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర విక్రయించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో దళారీల వ్యవస్థను నమ్మి ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని ఎమ్మెల్యే కుమార్ రాజా రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో టౌన్ ఫస్ట్ సాధించిన ఏ.మౌనిక



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పదవ తరగతి ఫలితాల్లో కృష్ణాజిల్లా పదవ స్థానం సంపాదించి, 'పదిలం'గా నిలిచింది. గత సంవత్సరం ఫలితాల్లో 11వ స్థానం సాధించిన జిల్లా, ఈ సంవత్సరం ప్రకటించిన ఫలితాల్లో 10 వ స్థానాన్ని పదిల పరుచుకుంది. నేడు ప్రకటించిన ఫలితాల్లో గత ఫలితాల కంటే కొంత పురోగతి సాధించింది. పదవ తరగతి పరీక్షలకు మొత్తం 20,776 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకాగా, 17,726 మంది ఉత్తీర్ణులయ్యారు. 85.43%తో 2024-25 సంవత్సరంలో జిల్లా పదవ స్థానంలో నిలిచింది. స్థానిక బాలభాను విద్యాలయంలో పదవ తరగతి ఫలితాల్లో అంగజాల మౌనిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, 600 మార్కులకు 595 మార్కులు సాధించి, టౌన్‌ఫస్ట్‌గా నిలిచింది. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించడం పట్ల కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, డి వై ఈ ఓ శేఖర్ సింగ్, ఎంఈఓ దుర్గాప్రసాద్, మౌనికను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పలువురు ప్రముఖులు మౌనిక మంచి మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాగా పదవ తరగతి రెగ్యులర్, ఓపెన్ పాఠశాలల విద్యార్థుల అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. పరీక్ష ఫీజు ఈనెల 24 వ తేదీ నుండి 30వ తేదీ వరకు చెల్లించవచ్చని, లేట్ ఫీజుతో మే 1 నుండి చెల్లించవచ్చని, మే 19 నుండి 28 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని, ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది.

## లోక కళ్యాణార్థం గోవు వృషభ కల్యాణం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** లోక క్షేమం, పశు సంపద వృద్ధికి జరిగే గో వృషభ కళ్యాణాన్ని పంచాయతీ శివారు బందులాయి చెరువు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో సింహాద్రి నారయ్య వంశీయులచే బుధవారం అత్యంత వైభవంగా జరిపారు. వృషభం తరపున సింహాద్రి రామచంద్రరావు, వెంకటేశ్వరమ్మ, సింహాద్రి మనోజ్ సంధ్య దంపతులు గోవు తరుపున కమ్మిలి రవి, లక్ష్మి



దంపతులు తల్లిదండ్రులుగా వ్యవహరించారు.వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ రుత్విక్కులు కళ్యాణాన్ని వైభవంగా జరిపారు. ఆవుకు ఎద్దుకు మంగళ స్థానాలు చేయించి పెళ్లి కుమారుడు పెళ్లి కుమార్తెల లాగా అలంకరించి, బాసికాలు కట్టి బుధవారం ఉదయం 10:40 నిమిషములకు జీలకర్ర బెల్లం పెట్టించారు అనంతరం మంగళ వాయిద్యాలు పండితుల మంత్రోచ్చారణ మధ్య తాళి కట్టించి తలంబ్రాలు కార్యక్రమం జరిపారు తదుపరి వృషభానికి శంకు చక్రం అచ్చువేసి గ్రామంలో వదిలారు ఈ కార్యక్రమానికి నలుమూలల నుండి వచ్చిన భక్తులకు సింహాద్రి వంశీయులు భోజన వసతి ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల భక్తులు బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని గో,వృషభ కళ్యాణాన్ని తిలకించారు.

## జై భీమ్ యూత్ చలివేంద్రం సేవలు అభినందనీయం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** బాటసారుల దాహాన్ని తీర్చేందుకు జై భీమ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ గోత్రు నాగబాబు చలివేంద్రం నిర్వహించడం అభినందనీయమని మండల తహశీల్దార్ బిలోకరాజు అన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు బస్టాండ్ వద్ద జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బుధవారం తహశీల్దర్ బి. లోకరాజు, ఎస్సై జి.వి.వి సత్యనారాయణ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 లీటర్ల పైగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లిపర పార్థసారథి, కొల్లిపర అనసూయ, విఆర్ఓ వెంకన్న, జై భీమ్ యువజన సేవా సంఘం మేనేజింగ్ డైరెక్టర్ గార్ల కిషోర్, మండల దళిత నాయకుడు వార పాపారావు, కిరణ్, ఎం సుబ్బారావు ఆటో యూనియన్ అధ్యక్షులు గోత్రు కోటేశ్వరరావు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కోగంటి బాబుకు దేవినేని ఉమా అభినందనలు



**కంచికచర్ల, ఏప్రిల్ 23, మేజర్ న్యూస్ :** కంచికచర్ల మార్కెటింగ్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన కోగంటి సత్యనారాయణ (బాబు) ని కంచికచర్ల మండలం పరిటాలలోని నివాసంలో మాజీ మంత్రి, టిడిపి ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమ కలిసి అభినందనలు తెలియజేశారు. కష్టాల్లో పార్టీకి ఎనలేని సేవలు కోగంటి బాబు చేశాడని ఉమా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్‌లన్ని కచ్చితంగా డీసిల్టింగ్ చెయ్యాలి

**విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరంలో నుండి నగర శివారు వరకు ఉండే డ్రైన్‌లన్ని కచ్చితంగా డీసిల్టింగ్ చెయ్యాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఎక్సెల్ ప్లాంట్, రాధానగర్ డ్రైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ముస్తాబాద్ రోడ్ ఔట్ ఫాల్ డ్రైన్, సింగ్ నగర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్సెల్ ప్లాంట్‌లో వ్యర్థాలు అన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ జిందాల్ కీ పంపించాలని, రాధానగర్ డ్రైన్ చిన్నగా ఉండటం వలన వ్యర్థాలు పేరుకుపోయినచో, వర్షపు నీటి నిల్వలు వెంటనే రోడ్డుపైకి వచ్చే అవకాశాలు ఉన్నందున దానిని పెద్దది చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగర శివారులైన ఇన్నర్ రింగ్ రోడ్డు, ముస్తాబాద్, రోడ్ ఔట్ ఫాల్ డ్రైన్ డీసిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలని, రానున్న వర్షాకాలంలో వర్షపునీటి నిలువలు రోడ్డుపైన రాకుండా ఉండాలంటే డ్రైన్ డీసిల్టింగ్ చేయడమే కాకుండా నగరంలోని డ్రైన్లు అన్ని చేరుకొనే ఔట్ ఫాల్ డ్రైన్లో డీసిల్టింగ్ చేసి వర్షపు ప్రవాహపు నీరులో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్తవంతన సెంటర్, సింగ్ నగర్ అన్న క్యాంటీన్లో పారిశుధ్య నిర్వహణ పరిశీలించి, పరిశుభ్రతలో ఎటువంటిలోపం లేకుండా చూసుకోవాలి అని అన్నారు. ఈ పర్యటనలో ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, సూపర్‌ఇంటెండింగ్ ఇంజనీర్ వర్క్స్ పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.







# జమ్మూ కాశ్మీరులో ఉగ్రదాడి దేశంపై జరిగిన కుట్ర



**అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** జమ్మూ కాశ్మీరులో ఉగ్రదాడి దేశంపై జరిగిన కుట్ర అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పర్యాటక అభివృద్ధి సాధిస్తున్న నేపథ్యం, అమర్ నాథ్ యాత్ర ప్రారంభం కానున్న సందర్భంగా ఉగ్రవాదులు పాల్పడిన ఈ చర్యను దేశం యావత్తు సమైక్యంగాఖండిస్తోందన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సంతాప దినాలు, కొవ్వొత్తుల ప్రదర్శన, మానవ హారం కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కుల మత ప్రాంతాలకు అతీతంగా భారతీయులు అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.

**పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన మృతుల ఆత్మ శాంతికి నివాళి**

**ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భారత అంతర్భాగం కాశ్మీర్లో భయానక వాతావరణం సృష్టించేందుకే ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో "జనసేన కన్నీటి నివాళి" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నుంచి వంతెన సెంటర్ వరకు కూటమి నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ, కూడలిలో ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రదాడి మృతుల ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు.



**విక్కుర్తి నేతృత్వంలో ఉగ్ర దాడి మృతులకు నివాళులు**

నియోజకవర్గ యువనాయకులు, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ నేతృత్వంలో కాశ్మీర్ ఉగ్రదాడి మృతులకు కొవ్వొత్తుల ప్రదర్శన ద్వారా ఘనంగా నివాళర్పించారు. కాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాదుల దాడి దేశంపై జరిగిన దాడి అని ప్రజాస్వామ్య వాదులంతా ఈ దాడిని ఖండించాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, విక్కుర్తి రాంబాబు, వీఎస్సార్ యువసేన నేతలు బర్మా శ్రీను, పులిగడ్డ చంద్ర, నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ పాలకులు ఎంవిడిటి నగేష్, గ్రంథాలయ సిబ్బంది పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. అనేక విషయాలకు సంబంధించిన పుస్తకాలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉన్నాయన్నారు. పాఠకులు వారి అభిరుచికి తగిన పుస్తకాలను చదవాలన్నారు. పరిషత్ కార్యదర్శి ముదిగొండ శాస్త్రి మాట్లాడుతూ పుస్తక పఠనం వలన కలుగు ప్రయోజనాలను వివరించారు. గ్రంథ పాలకులు ఎం వి డి టి నగేష్ మాట్లాడుతూ పాఠకులు తమకు కావలసిన పుస్తకాలను తీసుకొనుటకు వీలుగా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం లాల్ బహదూర్ శాస్త్రి, పలువురు ఉపాధ్యాయులు, డీఎస్సీ అభ్యర్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# హోంగార్డ్ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తాం

**ఎస్పీ ఆర్.గంగాధరరావు**





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** హోంగార్డ్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దర్బార్ కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు ఈ సందర్భంగా ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ మీ వృత్తిని గౌరవించి విధులు నిర్వహించండి. పనితనం ఉంటేనే గౌరవం పెరుగుతుంది. హోదాతో పని లేదు. మన అందరి యూనిఫాం ఒక్కటే. క్రమ శిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. హోంగార్డుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని, హోంగార్డులందరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, మీరు చేసేది హోంగార్డు ఉద్యోగం అయిన మీ వృత్తిని మీరు గౌరవించి విధులు నిర్వర్తించాలని, పోలీసు శాఖలో మంచి మెళుకువలు, పనితనం ఉంటేనే గౌరవం పెరుగుతుందని దానికి హోదాతో పనిలేదని, మన హోదాలు వేరైనా మనందరి యూనిఫామ్ ఒకటేనని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రతి ఒక్క హోంగార్డు విధులలో నైపుణ్యాన్ని బాగా మెరుగుపరుచుకొని ప్రజలకు మంచి సేవలు అందించాలని, విధులలో మంచి ప్రతిభ కనపర్చి పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచే విధంగా పని చేసిన ప్రతి ఒక్కరికీ రివార్డులు ఇస్తామని తెలిపారు. ప్రయాణాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పనిచేసే ప్రతి ఒక్క హోంగార్డు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సును కలిగి ఉండాలని అప్పుడే ఏదైనా అనుకొని ప్రమాదం జరిగినప్పుడు మీ కుటుంబ సభ్యులకు ఆసరాగా 30 లక్షల వరకు ఇన్సూరెన్స్ కవరేజ్ అవుతుందని తెలిపారు. అదేవిధంగా తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రయాణాలు సాగించాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి రోజు కొంత సమయం వాకింగ్, జాగింగ్ కు కేటాయించాలని, ప్రతి శుక్రవారం ఏర్పాటు చేసే పరేడ్‌లో అందరూ పాల్గొనాలని, పరేడ్ ను చాలా మంది భారంగా భావిస్తారు కానీ అది ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చుతుందని తెలిపారు. హోంగార్డ్స్ వృత్తి పరంగా ఆరోగ్యపరంగా వారికున్న సమస్యలు గురించి ఎస్పికి విన్నవించుకోగా, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి తమ పరిధిలో ఉన్నవన్నీ ఖచ్చితంగా పరిష్కరిస్తామని, తమ పరిధికి మించి ఉన్న సమస్యలను ప్రభుత్వం, అడిషనల్ డిజి దృష్టికి తీసుకొని వెళతామని భరోసా కల్పించారు. అదేవిధంగా హోంగార్డులు ఎవరైనా ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు తన దృష్టికి వస్తే ఎంక్వయిరీ చేసి వెంటనే సర్వీస్ నుంచి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ కమాండెంట్ విజయవాడ రీజియన్ టీ ఆనంద్ బాబు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి. నాయుడు, అడిషనల్ ఎస్పీ ఏఆర్ బి.సత్యనారాయణ, ఏఆర్ డిఎస్పి వెంకటేశ్వరరావు, హోమ్ గార్డ్స్ డిఎస్పి విజయవాడ డివిజన్ ఎన్. వెంకటరమణ, హోంగార్డ్స్ ఆర్ ఐ రవికుమార్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# విజయపరంపరతో ముందుకు సాగిపోతున్న శ్రీ చైతన్య

పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి





**కృష్ణలంక మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో బుధవారం విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ జీవితాన్ని మెరుగుపరుచు కోవడానికి విద్య ఒక ఆయుధం, చదువుతో పాటు, శ్రద్ధ, వినయం, విధేయత, కష్టపడి, ప్రయత్నం చేస్తే ఎంతో గొప్ప విజయాలను సాధించవచ్చు అన్నారు. పబ్లిక్ పరీక్షల్లో, పోటీ పరీక్షల్లో విజయ పరంపరతో ముందుకు సాగిపోతు విజయకేతనం ఎగరవేస్తున్న విద్యా సంస్థ శ్రీ చైతన్య అని ఉద్ఘాటించారు. విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో 40% విద్యార్థులు 500 పైగా మార్కులు, 75% విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు సాధించిన ఘన విజయానికి గర్వపడుతున్నామని విద్యార్థులను, ఉన్నత ఫలితాలకు సహాయ సహకారాలను అందించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ.జి.యం. యం.మురళి కృష్ణ, ఆర్.ఐ. జె.రాజేష్ బాబు, ఇన్చార్జులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.





అబ్దుల్ ఖతీజ తాహిర (571)



ఆర్.అక్ష (572)





ఎస్. నాగ లక్ష్మి సంజన (574)

## గుడ్లవల్లేరు పదవతరగతిలో 97 శాతం ఉత్తీర్ణత

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలో జరిగిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 504 మంది విద్యార్థులకు 490 మంది (97 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఓలు జి. జగన్మోహనరావు, జి.గోపాలరావు లు తెలిపారు. జెడ్పిహెచ్ఎస్ వడ్లమన్నాడు విద్యార్థిని ఎస్. నాగ లక్ష్మి సంజన 600 మార్కులకు 574 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో, జడ్.పి.హెచ్.ఎస్. పెంజంద్ర విద్యార్థిని ఆర్.అక్ష 600 మార్కులకు 572 మార్కులు సాధించి రెండవ స్థానంలో, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల అంగలూరు విద్యార్థిని అబ్దుల్ ఖతీజ తాహిర 600 మార్కులకు 571 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచారు. అలాగే ఎస్ఎల్ విబి జడ్పీ హెచ్ ఎస్ అంగలూరు విద్యార్థి కె.జయసూర్య 569(నాల్గవ), ఎస్ వి వి జిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డోకిపర్రు విద్యార్థిని సిద్దిఖా బేగం 566(అయిదవ), గుడ్లవల్లేరు ఎస్ఇఆర్ఎమ్ హైస్కూల్ విద్యార్థిని కె. శ్రీజ 563 (ఆరవ), కౌతరం జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి. హర్షవర్ధన్ 553(ఏడవ), విన్నకోట జడ్పీ హైస్కూల్ విద్యార్థి టి.జతిన్ 546(ఎనిమిదవ) స్థానాలు పొందారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను, హెచ్ఎమ్‌లు, ఉపాధ్యాయులను ఎంఈఓ 1 జి. జగన్మోహనరావు, ఎంఇఓ 2 జి గోపాలరావులు అభినందించారు.



## పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన విజయ అకాడమీ విద్యార్థులు

బళ్ళా బేబి నాగసాయి కీర్తన 600కు 594 మార్కులతో మండలం సెకండ్

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాలలో చల్లపల్లి శ్రీ విజయ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం విడుదల అయిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బళ్ళా బేబి నాగసాయి కీర్తన 600కు 594 మార్కులతో మండలం సెకండ్ సాధించగా, పీతా నితీష్ శంకర్ 600కు 591 మార్కులు, బాణావత్తుల నిత్య 600కు 590 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గొర్రెపాటి రంగబాబు, కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



## కాకతీయ-అపోలో విద్యాసంస్థలు ఘన విజయం

**నందిగామ, ఏప్రిల్ 23, మేజర్ న్యూస్:** బుధవారం వెలువడిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో కాకతీయ -అపోలో విద్యాసంస్థల విద్యార్థులు ఘనవిజయంసాధించారు. యలమంద ల నిత్యశ్రీ 600కు గాను 589,ఆనంగి పావని 585,డి.ఉమా దీక్షిత 584 మార్కులతో, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల నుండి హాజరైన మొత్తం విద్యార్థులు -147,ఉత్తీర్ణులైన వారు -145 ఉత్తీర్ణత శాతం 99% ఈ విజయాన్ని సాధించిన విద్యార్థిని విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు పాఠశాల చైర్మన్ కాపా రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ కాపాభారతి, అభినందనలు తెలియజేశారు.



## పది పరీక్షల్లో శారదా ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న శారదా ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరం పదోవ తరగతి పరీక్షల్లో 13 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకాగా.. వారిలో 11 మంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని పాఠశాల సెక్రటరీ కుందా రామనారాయణ, ప్రిన్సిపాల్ ఎ.ఎల్.ఎన్ మూర్తి తెలిపారు. మొత్తం మీద 82శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. జె.ప్రవీణ్ 526, బి.సాయిసాత్విక్ 520 మార్కులతో ఉత్తీర్ణత సాధించగా.. మిగిలిన విద్యార్థులకు 500 మార్కులు దాటినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల సెక్రటరీ కుందా రామనారాయణ, ప్రిన్సిపాల్ ఎ.ఎల్.ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

## మెరుగైన ఫలితాలు సాధించిన జడ్పీహెచ్ఎస్



ఇ.పల్లవి (584) అప్పల భవిత (581) బత్తుల ప్రవల్లిక (578)

**కోడూరు మేజర్ న్యూస్ :** బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలు ప్రథమ స్థానం ఇమడాబత్తిన పల్లవి 584 /600 డాక్టర్ ఆఫ్ రామాంజనేయులు, రమాదేవి,ద్వితీయ స్థానం అప్పల భవిత 581/ 600 శివమణి, కుమారి, తృతీయ స్థానం బత్తుల ప్రవల్లిక 578/600 రాజు, వనజాక్షి, వరుసగా సాధించారు. 75 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుగా 55 మంది విద్యార్థులతో 73.33% ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను శ్రీ చామర్తి ప్రకాశ్రాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ స్వతంత్రపురం సాధించిందని తెలియజేయుటకు సంతోషిస్తున్నా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆల వెంకటరమణ తెలియజేయు ఉన్నారు.

## పదవ తరగతిలో ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ హైస్కూల్ 99 శాతం ఉత్తీర్ణత



వత్తుమిల్లి తరుణ్ మార్కులు 579/600 పర్సంటేజ్ 96.5
పెనుమూడి జయశ్రీ మార్కులు 575/600 పర్సంటేజ్ 95.8
పి.శివ నాగబాబు మార్కులు 575/600 పర్సంటేజ్ 95.8



వి.చంద్రశేఖర కృష్ణ మార్కులు 571/600 పర్సంటేజ్ 95.2
పి. లిఖిత శ్రీ మార్కులు 571/600 పర్సంటేజ్ 95.2
బి. మేరీ అమృ[illegible] మార్కులు 571/6[illegible] పర్సంటేజ్ 95.[illegible]

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** 2025 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో గుడ్లవల్లేరు ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ (ఇం. మీ ) స్కూల్ నుండి 80 మంది విద్యార్థులు హాజరు కాగా 79 మంది విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ లీనా సాతులూరి తెలిపారు. వత్తుమిల్లి తరుణ్ 579 మార్కులతో స్కూల్ ప్రథమ స్థానం,.పి.జయశ్రీ, పి.శివనాగబాబు 575 మార్కులతో ద్వితీయ స్థానాన్ని సాధించారని, 19 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా, 34 మంది విద్యార్థులు 500 పైగా, 27 మంది విద్యార్థులు 350 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను ప్రిన్సిపాల్ లీనా సాతులూరి, డైరెక్టర్ ఎన్. శ్రీనివాస మూర్తి, స్కూల్ యాజమాన్యం అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 80శాతం ఉత్తీర్ణత

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 80శాతం ఉత్తీర్ణతా శాతం లభించింది. ఐదు జడ్పీ హైస్కూల్స్, గురుకుల పాఠశాల, ఎయిడెడ్ పాఠశాలలు కలిపి మొత్తం ఏడు పాఠశాలల్లో 329 మంది పరీక్షలు రాయగా 263 మంది ఉత్తీర్ణులయ్యారు. చల్లపల్లి జడ్పీ హైస్కూల్కు చెందిన బత్తుల బ్యూలా పావలల్లి 575 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల విభాగంలో మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. చల్లపల్లి జడ్పీ విద్యార్థిని జి.శశికళ 574 మార్కులు, మాజేరు జడ్పీ విద్యార్థిని కూనపరెడ్డి సాయికీర్తి 574 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, చల్లపల్లి గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని కొల్లు సిరి 551 మార్కులు, పురిటిగడ్డ జడ్పీ విద్యార్థిని అవనిగడ్డ హేమశ్రీ 550 మార్కులు, వక్కలగడ్డ, చల్లపల్లి రాజా హైస్కూల్ విద్యార్థులు పాగోలు కేశవ నాగకస్తూరి, అద్దంకి వీర రాజేశ్వరి, దున్నా రమ్యలు 541 మార్కులు, మంగళాపురం జడ్పీ విద్యార్థిని డొక్కు శివపార్వతి 509 మార్కులు సాధించారు. చల్లపల్లి మండలంలో ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలకు సంబంధించి మొత్తం 820 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలు రాయగా, 748 మంది ఉత్తీర్ణులై 91శాతం ఉత్తీర్ణత లభించింది. శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని తాళ్ల జ్ఞాన నాగ సంజన 596 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం లో నిలవగా, విజయా అకాడమీ విద్యార్థిని బళ్లా నాగ సాయి కీర్తన 594 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో నిలిచింది. మదర్ థెరిస్సా విద్యార్థిని తుమ్మా సింధు 590 మార్కులు సాధించగా, విజయా అకాడమీ, ఎన్టీఆర్ మోడల్ స్కూల్, శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు.



జి.శశికళ (574)



కూనపరెడ్డి సాయికీర్తి (574)

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999